మంగళవారం 11-6-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 361, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



మోడీ టీంలో ఏడుగురు మహిళ మంత్రులు

వివరాలు 3లో



మోడీకి పాకిస్థాన్ ప్రధాని శుభాకాంక్షలు

వివరాలు 2లో



మీరు వెయిట్ లాస్ కావాలా...!

వివరాలు 4లో



వర్షాకాలంతో వ్యాధులు వస్తాయి..!

వివరాలు 4లో



# బాధ్యతలు స్వీకరించిన ప్రధాని మోడీ


- పీఎం కిసాన్ నిధి విడుదలపై తొలి సంతకం
- సంక్షేమంపై మరింత దృష్టి సారిస్తామని వెల్లడి

**ముందడుగు జాతీయం:**

ఢిల్లీలోని సౌత్‌బ్లాక్‌లోని పీఎంఓ కార్యాలయంలో భారత ప్రధానిగా నరేంద్రమోడీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మూడో దఫా తన విధుల్ని మొదలుపెట్టేశారు. ఈ సందర్భంగా రైతులకే తొలి ప్రాధాన్యం ఇచ్చారు. పీఎం కిసాన్ నిధి విడుదల దస్త్రంపై తొలిసంతకం చేశారు. దీంతో 9.3 కోట్లమంది రైతులకు రూ.20వేల కోట్ల ఆర్థిక సహాయం అందుతుంది. ''మా ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉంది. బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి సంతకం వారి సంక్షేమానికి సంబంధించినదే కావడం విశేషం. రాబోయే రోజుల్లో వ్యవసాయరంగానికి, కర్షకుల సంక్షేమంపై మా ప్రభుత్వం మరింత దృష్టి సారించనుంది'' అని సంతకం చేసిన తర్వాత మోడీ వెల్లడించారు. సోమవారం మోడీ క్యాబినెట్ తొలి సమావేశం జరగనుంది. మిగతా 2లో

# పేదల కోసం 3 కోట్ల ఇళ్లు

## కేంద్ర కేబినెట్ తొలి నిర్ణయం



**ముందడుగు జాతీయం:**

దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ప్రధాని మోడీ ప్రభుత్వం పేదల కోసం 3 కోట్ల ఇళ్లను నిర్మించనుంది. ప్రధాని మోడీ నివాసంలో సోమవారం సాయంత్రం జరిగిన తొలి కేబినెట్ సమావేశంలో ఈ మేరకు తొలి నిర్ణయం తీసుకున్నది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గ్రామీణ, పట్టణాల్లో మరో మూడు కోట్ల గృహాల నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వ సహాయాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. 'అర్హత ఉన్న కుటుంబాల సంఖ్య పెరిగిన నేపథ్యంలో గృహ అవసరాలను తీర్చడానికి గ్రామీణ, పట్టణ కుటుంబాలకు మూడు కోట్ల అదనపు ఇళ్ల నిర్మాణం కోసం సహాయం అందించాలని సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు' అని అధికారులు తెలిపారు.

2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 201516నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకాన్ని అమలు చేస్తుంది. అర్హులైన గ్రామీణ, పట్టణ ప్రజలకు గృహాల నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందిస్తోంది. గత పదేళ్లలో ఈ పథకం కింద పేద కుటుంబాల కోసం 4.21కోట్ల గృహాలను నిర్మించారు.

# ఒక్క ప్రభుత్వ బడిని మూసివేయొద్దు

- సమస్యలు ఉన్న పిల్లలు బాగా రాణిస్తున్నారు
- 90 శాతం మంది అధికారులు ప్రభుత్వ విద్యార్థులే
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు



**ముందడుగు హైదరాబాద్ :**

తెలంగాణలోని సింగిల్ ఉపాధ్యాయుడు ఉన్న స్కూళ్లను మూసివేయవద్దని, ప్రభుత్వ స్కూళ్లలో కొన్ని సమస్యలు ఉన్నాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్లోని రవీంద్ర మిగతా 2లో



# బంగ్లాదేశ్ ప్రధాని హసీనాను కలిసిన సోనియా

## సోనియాతో పాటు కలిసిన రాహుల్, ప్రియాంక

**ముందడుగు జాతీయం:**

కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ, పార్టీ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా కలిసి బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాను సోమవారం కలిశారు. ఇరు కుటుంబాల మధ్య ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. శనివారం మిగతా 2లో

ముందడుగు
మంగళవారం, 11-6-2024, హైదరాబాద్

# గ్రూప్-1 పరీక్షకు లక్షమందికి పైగా డుమ్మా

**ప్రశ్నాపత్రం చాలా కఠినమంటున్న అభ్యర్థులు ▪ మెయిన్ పరీక్షకు ఎంపిక కానున్న 28,150 మంది**

**ముందడుగు తెలంగాణ:**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్ష ముగిసింది. రాష్ట్రంలో 563 గ్రూప్1 పోస్టుల భర్తీకి సంబంధించి పరీక్ష జూన్ 9వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 895 పరీక్ష కేంద్రాల్లో ఓఎంఆర్ పద్ధతిలో TSPSC Group 1 పరీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 4.03 లక్షల మంది పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రశ్నపత్రం కఠినంగానే ఉందని పలువురు అభ్యర్థులు వెల్లడించారు. గత ఐదేళ్ల కాలానికి సంబంధించిన జనరల్ అంశాలపై ఎక్కువ ప్రశ్నలు అడిగారు. సుదీర్ఘ ప్రణాళికతో సన్నద్ధమైన అభ్యర్థులే ప్రిలిమ్స్ ఉత్తీర్ణులు కాగలరని నిపుణులు సూచిస్తున్నారు. త్వరలోనే టీజీపీఎస్సీ ప్రిలిమ్స్ ప్రాథమిక కీ, ఫలితాలు విడుదల కానున్నాయి.

### లక్ష మందికి పైగా పరీక్షకు డుమ్మా :

టీఎస్‌పీఎస్సీ గ్రూప్1 ప్రిలిమినరీ పరీక్షకు లక్షకుపైగా అభ్యర్థులు డుమ్మాకొట్టారు. మొత్తం 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. వారిలో 3.02లక్షల మంది మాత్రమే హాజరైనట్లు టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. అంటే కేవలం 74 శాతం మాత్రమే పరీక్ష రాశారు. ఇక.. అక్టోబర్ 21 నుంచి గ్రూప్1 మెయిన్ పరీక్షలు నిర్వహించనున్నారు. మల్టీ జోన్, రోస్టర్ ప్రకారం ఒక్కో పోస్టుకు 50 మంది చొప్పున మెయిన్ పరీక్షకు 28,150 మందిని ఎంపిక చేయనున్నట్లు కమిషన్ ఈ సందర్భంగా వెల్లడించింది.

### కటాఫ్ ఎంత ఉంటుందంటే..?

లాజికల్ రీజనింగ్, అనలెటికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రెటేషన్ నుంచి 25 ప్రశ్నలు వచ్చాయి. గణితం నేపథ్యమున్న వారు వీటికి సులువుగా సమాధానాలు గుర్తించవచ్చు. అలాగే సర్వేలు, నివేదికల నుంచి కూడా ప్రశ్నలు వచ్చాయి. ఈసారి జనరల్ కటాఫ్ 7580 మార్కుల మధ్య ఉండొచ్చని నిపుణుల అంచనా.

## ఉచిత విద్య, వైద్యం మాత్రం ఇవ్వరు



సమాజంలో ఒక కుటుంబం చిన్నాభిన్నమయ్యేది విద్య, వైద్యంతోనే.. ఎన్నికల గెలుపుకోసం నెరవేరని ఎన్నో హామీలు ఇచ్చే నాయకులు, నిజంగా ప్రజలంటే ఒక్క శాతం ప్రేమ ఉంటే నాణ్యత గల ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించవచ్చు కదా. ఉన్నంతలో ఉంటూ ఆనందంగా ఉండే ఒక కుటుంబాన్ని క్షణంలోనే కార్పోరేట్ వైద్యం సర్వనాశనం చేస్తోంది. రెక్కలు ముక్కలు చేసుకున్న పిల్లల పాఠశాలల, కళాశాలల ఫీజులు కట్టలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు ఈ రెండు విషయాలపై ఎందుకు దృష్టి సారించట్లేదు.. ఈ రెండు ఇవ్వాలనే ఆలోచన ఎందుకు రావడం లేదో తెలియదు.

**- రాజేంద్ర పల్నాటి, పౌండర్, యూత్ ఫర్ యాంటీకరప్షన్**

## బంగ్లాదేశ్ ప్రధాని హసీనాను కలిసిన సోనియా

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీకి చేరుకున్న షేక్ హసీనా ఆదివారం జరిగిన ప్రధాని మోదీ, ఆయన మంత్రివర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, గాంధీ కుటుంబానికి మధ్య ఎన్నో ఏళ్లుగా అనుబంధం ఉంది. షేక్ హసీనా తండ్రి, బంగ్లాదేశ్ వ్యవస్థాపక నేత షేక్ ముజిబుర్ రెహమాన్, అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. 1971లో బంగ్లాదేశ్ విముక్తి యుద్ధంలో ఇందిరా గాంధీ ముఖ్యపాత్ర పోషించారు. పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్‌ను విముక్తి చేశారు. ఆ దేశ స్వాతంత్ర్యానికి మద్దతు ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఇందిరా గాంధీ కుటుంబం, షేక్ హసీనా కుటుంబంతోపాటు భారత్, బంగ్లాదేశ్ మధ్య దీర్ఘకాల కృతజ్ఞతా భావాన్ని, పరస్పర గౌరవాన్ని ఇది పెంపొందించింది

# మణిపూర్ సీఎం కాన్వాయ్‌పై కాల్పులు

## రాష్ట్రంలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు

**ముందడుగు మణిపూర్:**

మణిపూర్‌లో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ సెక్యూరిటీ కాన్వాయ్‌పై దాడికి ప్రయత్నాలు జరిగాయి. సోమవారం ఉదయం సాయుధులైన కొందరు తీవ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. సీఎం కార్యాలయానికి చెందిన వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. ఈ ఘటన కాంగ్‌పోక్పి జిల్లాలో చోటుచేసుకొంది.



ఇటీవల జిరిబామ్ జిల్లాలో ఓ వ్యక్తిని గుర్తు తెలియని దుండగులు దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ ఘటనతో రాష్ట్రంలో ఉద్రిక్తతలు తీవ్రంగా మారాయి. 70కి పైగా ఇళ్లను తగలబెట్టడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మరికొందరు పౌరులు వేరే చోటుకు పారిపోయినట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో తమ వద్ద నుంచి లైసెన్స్ తుపాకులను జప్తు చేయడంతో వాటిని తిరిగి ఇచ్చేయాలంటూ స్థానికులు జిల్లా పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనకు దిగారు. ఇలా కొన్ని రోజులుగా అశాంతి నెలకొన్న ఈ ప్రాంతాన్ని సందర్శించాలని సీఎం బీరేన్‌సింగ్ అనుకున్నారు. ఈ క్రమంలోనే ఇంఫాల్ నుంచి జిరిబామ్‌కు సీఎం సెక్యూరిటీ కాన్వాయ్ బయల్దేరింది. దీనిపై సాయుధులైన తీవ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సెక్యూరిటీ సిబ్బందిలో ఒకరు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.

# బాధ్యతలు స్వీకరించిన ప్రధాని మోడీ

మొదటిపేజీ తరువాయి

పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటుచేయాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అభ్యర్థించనుంది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ జరగబోయే సమావేశాల ప్రారంభం రోజున రెండు సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తారు. ఈ ప్రభుత్వ దార్శనికత, ప్రాధాన్యతలను పేర్కొంటారు. 2014, 2019 ఎన్నికల్లో విజయం తర్వాత రెండుసార్లు ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీ.. తాజా ఎన్నికల్లో కూటమి విజయదుందుభితో వరుసగా మూడోసారి పీఠమెక్కిన ఘనత సాధించారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత దేశంలో వరుసగా మూడోసారి ప్రధాని అయిన ఘనతను సొంతం చేసుకున్నారు. తాజా కేంద్ర సర్కార్ 71 మంది మంత్రులతో కొలువుదీరింది. అందులో 30 మంది క్యాబినెట్ మంత్రులుగా ఉన్నారు.

# ఒక్క ప్రభుత్వ బడిని మూసివేయొద్దు

మొదటిపేజీ తరువాయి

భారతిలో ప్రతిభా పురస్కారాల ప్రదాన కార్యక్రమం జరిగింది. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన గవర్నమెంట్ స్కూళ్ల పిల్లలతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. వారికి పురస్కారాలను అందించారు.

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లలో సమస్యలు ఉన్నప్పటికీ పిల్లలు బాగా రాణిస్తున్నారని అన్నారు. తనతోపాటు చంద్రబాబు, ప్రధాని మోదీ లాంటివారంతా ప్రభుత్వ స్కూళ్లలోనే చదువుకున్నామని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. వీరేకాక ప్రస్తుతం ఉన్న 90 శాతం మంది ఐఏఎస్, ఐపీఎస్ ఐఎఫ్ఎస్ అధికారులు ప్రభుత్వ బడుల్లో చదువుకున్నవారే అని చెప్పారు. తెలంగాణలోనూ ప్రభుత్వ పాఠశాల విషయంలో మార్పులు తీసుకువస్తామని.. సెమీ రెసిడెన్షియల్ విద్యావిధానంపై రివ్యూ చేస్తామని రేవంత్ అన్నారు. 2024 జూన్ 9 నుంచి జయశంకర్ బడి బాట కార్యక్రమం ప్రారంభం అయిందని.. 20వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. ఆదర్శ పాఠశాలల నిర్వహణ మహిళా సంఘాలకే ఇచ్చామని చెప్పారు. విద్యకు కేటాయించే నిధుల్లో ఎక్కువ శాతం జీతాలకే అవుతుందని చెప్పారు. విద్యపై చేసేది ఖర్చు కాదని.. అది, పెట్టుబడి లాంటిదని రేవంత్ రెడ్డి అన్నారు.

# మోడీకి పాకిస్థాన్ ప్రధాని శుభాకాంక్షలు

## పాకిస్థాన్‌కు ఆహ్వానం పంపని భారత్

**ముందడుగు జాతీయం:**

భారత ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోడీకి పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. మోదీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ఏడు పొరుగు దేశాలను ఆహ్వానించినప్పటికీ.. పాకిస్థాన్‌కు మాత్రం భారత్ ఆహ్వానం పంపలేదు. దీంతో దాయాది దేశం ఈ కార్యక్రమానికి దూరంగా ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో మోదీకి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కూడా ఇటీవల శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిగా ధన్యవాదాలు తెలిపిన ప్రధాని మోదీ.. పరస్పర అవగాహన, ఇరుదేశాల ఆందోళనలను అర్థం చేసుకుంటూ, కెనడాతో పని చేసేందుకు భారత్ ఎదురుచూస్తోందని చెప్పారు.





ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్యలో భారత్ ఏజెంట్ల హస్తం ఉందంటూ కెనడా ప్రధాని ట్రూడో ఆరోపణలు చేయడం ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపింది. వీటికి దీటుగా బదులిస్తోన్న భారత్.. ఆ ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను చూపెట్టాలని డిమాండ్ చేస్తోన్న సంగతి తెలిసిందే.

ముందడుగు
మంగళవారం, 11-6-2024, హైదరాబాద్

# మోడీ టీంలో ఏడుగురు మహిళ మంత్రులు

## కేంద్ర సహాయ మంత్రిగా 30 ఏళ్ల రక్షా ఖడ్సే ▪ సావిత్రి ఠాకూర్ తొలిసారి మంత్రి పదవి

**ముందడుగు జాతీయం:**

భారత ప్రధాని నరేంద్ర మోడీ కేబినెట్లో ఈ సారి ఏడుగురు మహిళలు మంత్రులుగా ఉన్నారు. గతంలో ఆర్థిక, రక్షణ మంత్రిత్వ శాఖలు నిర్వహించిన రాజ్యసభ సభ్యురాలైన నిర్మలా సీతారామన్‌తోపాటు జార్ఖండ్‌లోని కోడెర్మా ఎంపీగా రెండుసార్లు గెలిచిన అన్నపూర్ణా దేవి కేబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. గత ప్రభుత్వంలో అన్నపూర్ణా దేవి విద్యాశాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మిత్రపక్షమైన అప్నా దళ్ (సోనేలాల్) అధినేత్రి అనుప్రియా పటేల్ కేంద్ర సహాయ మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. మోదీ తొలి ప్రభుత్వంలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రిగా ఆమె పనిచేశారు. మోదీ రెండో ప్రభుత్వంలో వాణిజ్యం, పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా ఉన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ఆమె పార్టీ



గెలిచిన ఎంపీ స్థానాల సంఖ్య రెండు నుంచి ఒకటికి పడిపోయింది.

మరోవైపు 30 ఏళ్ల రక్షా ఖడ్సే మరో కేంద్ర సహాయ మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. మహారాష్ట్రకు చెందిన రాజకీయ నేత ఏక్‌నాథ్ ఖడ్సే కోడలైన ఆమె రేవర్ నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచారు. గతంలో సర్పంచ్‌గా, జిల్లా పరిషత్ సభ్యురాలిగా ఆమె పనిచేశారు. కర్ణాటక నుంచి రెండుసార్లు బీజేపీ ఎంపీగా గెలిచిన శోభా కరంద్లాజే కూడా కేంద్ర సహాయ మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. గత ప్రభుత్వంలో కూడా ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, వ్యవసాయం, రైతుల సంక్షేమ శాఖల సహాయ మంత్రిగా ఆమె ఉన్నారు.

మధ్యప్రదేశ్‌లోని ధార్ ఎంపీ స్థానం నుంచి రెండుసార్లు ఎంపీగా గెలిచిన సావిత్రి ఠాకూర్ ఆదివారం కేంద్ర సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. మోదీ మూడో ప్రభుత్వంలో తొలిసారి మంత్రి పదవిని ఆమె చేపట్టారు. మధ్యప్రదేశ్‌లోని భావ్‌నగర్ ఎంపీగా గెలిచిన 57 ఏళ్ల నిముబెన్ భంబనియా కూడా తొలిసారి కేంద్ర సహాయ మంత్రిగా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ ఉపాధ్యాయురాలైన ఆమె గతంలో భావ్‌నగర్ మేయర్‌తోపాటు స్థానిక బీజేపీలో పలు పదవులు చేపట్టారు. మరోవైపు మోదీ మూడో ప్రభుత్వంలో కేంద్ర మంత్రులుగా ఏడుగురు మహిళలు ఉండగా, గత ప్రభుత్వంలో పది మంది మహిళా మంత్రులు ఉన్నారు. ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో మొత్తం 74 మంది మహిళలు ఎంపీలుగా గెలిచారు. అయితే 2019లో ఎన్నికైన 78 మందితో పోలిస్తే ఈసారి మహిళా ఎంపీల సంఖ్య స్వల్పంగా తగ్గింది.

# ఒకప్పుడు ఉపాధ్యాయుడు.. ఇప్పుడు సిక్కిం సీఎం

▪ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను మట్టి కరిపించారు

▪ సిక్కిం సీఎంగా ప్రేమ్‌సింగ్ తమాంగ్ ప్రమాణస్వీకారం



**ముందడుగు సిక్కిం:**

సిక్కిం రాష్ట్ర ముఖ్యమంత్రిగా 'సిక్కిం క్రాంతికారి మోర్చా' అధ్యక్షుడు ప్రేమ్‌సింగ్ తమాంగ్ చేత సోమవారం సిక్కిం గవర్నర్ లక్ష్మణ్ ఆచార్య ప్రమాణస్వీకారం చేయించారు. గ్యాంగ్‌టక్‌లోని పల్జోర్ స్టేడియంలో తమాంగ్ ప్రమాణస్వీకార కార్యక్రమం జరిగింది. ఆయనతోపాటు ఎస్‌కేఎం ఎమ్మెల్యేలు సోనమ్ లామా, అరుణ్‌కుమార్ ఉప్రేతి క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణం చేశారు. సిక్కిం అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 32 స్థానాలకుగాను 31 స్థానాల్లో అధికార ఎస్కేఎం ఘన విజయం సాధించింది. 2019కి ముందు ఏకంగా 25 ఏండ్లపాటు రాష్ట్రాన్ని ఏలిన ప్రతిపక్ష 'సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్' కేవలం ఒక్క స్థానానికే పరిమితమైంది. కాగా ప్రేమ్‌సింగ్ తమాంగ్ సిక్కిం ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకోవడం ఇది వరుసగా రెండోసారి. 2019 నుంచి 2024 వరకు ఆయనే ముఖ్యమంత్రిగా ఉన్నారు.

తమాంగ్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి 30 వేల మందికి ఆహ్వానించారు. ప్రమాణస్వీకారానికి కొన్ని నిమిషాల ముందు కార్యక్రమానికి విచ్చేసిన వారికి తమాంగ్ అభివాదం చేశారు. ఈ సందర్భంగా పటాసులు కాల్చి అభిమానులు సంబురాలు చేసుకున్నారు. కాగా మరోసారి సిక్కిం ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన 56 ఏండ్ల ప్రేమ్ సింగ్ తమాంగ్ రాష్ట్ర ప్రజల నుంచి మంచి ఆదరణ పొందారు. తమాంగ్ రాజకీయాల్లోకి రాకముందు మూడేండ్లు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్ నుంచే తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1994 నుంచి 2009 వరకు ఆయన మంత్రిగా పనిచేశారు. ఎస్‌డీఎఫ్‌లో ఆయన చామ్లింగ్‌కు శిష్యుడిగా కొనసాగారు. 2009 తర్వాత ఆయనకు పవన్ కుమార్ చామ్లింగ్‌తో విభేదాలు మొదలయ్యాయి.

దాంతో ఎస్‌డీఎఫ్ నుంచి బయటకు వచ్చి 2013లో సొంతంగా ఎస్‌కేఎం పార్టీని స్థాపించారు. 2019 ఎన్నికల్లో 17 సీట్లు సాధించి 25 ఏండ్ల ఎస్‌డీఎఫ్ పాలనకు ముగింపు పలికారు. ఈ ఎన్నికల్లో ఏకంగా 31 స్థానాలు గెలుచుకుని ప్రతిపక్ష ఎస్‌డీఎఫ్‌కు ఘోర పరాభవం రుచి చూపించారు. సిక్కింలో జాతీయ పార్టీలు బీజేపీ, కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయాయి. ఆ పార్టీలకు ఈ ఎన్నికల్లో 20 వేల ఓట్లు కూడా రాలేదు.

# కేంద్ర మంత్రులు.. కేటాయించిన శాఖలు

**ముందడుగు జాతీయం:**

కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ప్రధాని మోడీ సహా 72 మంది కేంద్రమంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధానమంత్రితో సహా 72 మంది మంత్రుల్లో 30 మంది క్యాబినెట్ మంత్రులు, ఐదుగురు స్వతంత్ర బాధ్యతలు, 36 మంది రాష్ట్ర మంత్రులతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణం చేయించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం 5 గంటలకు కొత్తగా ఏర్పాటైన ఎన్డీయే ప్రభుత్వ తొలి కేబినెట్ సమావేశం జరిగింది. ఈ క్రమంలో మంత్రులకు శాఖలను కేటాయించారు.



**అమిత్ షా :** హోంమంత్రిత్వ శాఖ
**రాజ్‌నాథ్ సింగ్ :** రక్షణ శాఖ
**నితిన్ గడ్కరీ:** రోడ్లు, రహదారులు (రవాణా శాఖ)
**నిర్మలా సీతారామన్:** ఆర్థిక మంత్రి
**జేపీ నడ్డా :** ఆరోగ్యశాఖ
**ఎస్ జైశంకర్ :** విదేశాంగ శాఖ మంత్రి
**శివరాజ్ సింగ్ చౌహాన్ (బీజేపీ):** వ్యవసాయశాఖ మంత్రిత్వశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ
**మనోహర్ లాల్ ఖట్టర్ :** ఇంధన మంత్రిత్వశాఖ, పట్టణాభివృద్ధి శాఖ, విద్యుత్ గృహ నిర్మాణశాఖ
**అశ్వినీ వైష్ణవ్:** రైల్వే, సమాచార, ప్రసార శాఖ
**పీయూష్ గోయల్:** వాణిజ్య మంత్రిత్వ శాఖ
**ధర్మేంద్ర ప్రధాన్:** విద్యాశాఖ
హర్దీప్ సింగ్ పూరి: పెట్రోలియం శాఖ
**చిరాగ్ పాశ్వాన్:** యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ
**రామ్మోహన్నాయుడు:** పౌర విమాన యాన శాఖ
**అన్నపూర్ణాదేవి:** మహిళా, శిశు అభివృద్ధి
**సీఆర్ పాటిల్** జలశక్తి
శర్బానంద సోనోవాల్ ఓడరేవులు, షిప్పింగ్
**శోభ కరంద్లాజే** చిన్న, మధ్య తరహా పరిశ్రల సహాయ మంత్రి
**రావ్ ఇంద్రజిత్ సింగ్** సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ సహాయ మంత్రి
**భూపేంద్ర యాదవ్ :** పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పు శాఖ
**కిరణ్ రిజిజు:** పార్లమెంటరీ వ్యవహారాల శాఖ
**హెచ్‌డీ కుమారస్వామి :** ఉక్కుశాఖ
**రవనీత్ సింగ్ బిట్టు:** మైనార్టీ వ్యవహారాల శాఖ
**జ్యోతిరాదిత్య సింధియా:** టెలికమ్యూనికేషన్ శాఖ
**గజేంద్ర సింగ్ షెకావత్:** పర్యాటక శాఖ
**ప్రహ్లాద్ జోషి:** ఆహారం, వినియోగదారుల సేవలు
**సురేష్ గోపి:** టూరిజం శాఖ సహాయమంత్రి
**రావ్ ఇంద్రజిత్ సింగ్:** సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ సహాయమంత్రి
**కిషన్ రెడ్డి:** బొగ్గు గనుల శాఖ మంత్రి
**బండి సంజయ్** హోంశాఖ సహాయ మంత్రి
**గిరిరాజ్ సింగ్** టెక్స్‌టైల్స్ శాఖ
**పెమ్మసాని చంద్రశేఖర్ :** గ్రామీణ, కమ్యూనికేషన్ శాఖ
**శ్రీనివాసశర్మ** ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి
**జితన్ రామ్ మాంఝీ** సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ
**లల్లన్ సింగ్** ఫిషరీస్, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ

ముందడుగు
మంగళవారం, 11-6-2024, హైదరాబాద్



# మీరు వెయిట్ లాస్ కావాలా...!

## అయితే చపాతీలను ఇలా తినండి

**ముందడుగు ప్రత్యేకం:**

మనిషి బిజిబిజీ జీవితంలో సమయానికి తిండి, తినక పోవడంతో ఎన్నో అనారోగ్య సమస్యలకు కారణం అవుతున్నారు. అందులో అధిక బరువు కూడా ఒకటి. బరువు పెరిగినంత ఈజీగా.. వెయిట్ లాస్ అవ్వడం చాలా కష్టం. ఇందు కోసం అహర్నిశలు శ్రమించాలి. చాలా మంది ఎన్నెన్నో రకాల పద్ధతులను పాటిస్తూ ఉంటారు. కొంది వ్యాయామాలు చేస్తూ ఉంటారు. ఇంకెంత మంది తమ డైట్‌ని మొత్తం మార్చేస్తారు. ఇలా చాలా చేస్తేనే తప్ప.. బరువు తగ్గరు. వెయిట్ లాస్ అయ్యేందుకు చాలా మంది తమ డైట్‌లో ఖచ్చితంగా చపాతీ ఉండేలా చూసుకుంటారు. కానీ చపాతీలను తీసుకునే టెక్నిక్ తెలీదు. ఈ టెక్నిక్‌లో చపాతీలను తీసుకుంటే.. ఈజీగా వెయిట్ లాస్ అవుతారు. ఈ మధ్య కాలంలో చాలా మంది రాత్రి పూట చపాతీలను తినడం అలవాటు చేసుకుంటున్నారు. రాత్రి పూట చపాతీలు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య లాభాలు ఉన్నాయి. బరువు తగ్గాలి అనుకునేవారు ఈ చపాతీలను ఎలా తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.

### గోధుమలతో పిండి పట్టించండి

చపాతీలను తయారు చేసుకోవడానికి చాలా మంది రెడీమేడ్ చపాతీ పిండిని కొని చేస్తూ ఉంటారు. కానీ అలా కాకుండా స్వచ్ఛమైన గోధుమలు తీసుకుని.. మీరే స్వయంగా పిండి పట్టించండి. దీని వల్ల మంచి పోషకాలు మీకు అందుతాయి. ఈ గోధుమల్లో మీరు మిల్లేట్స్‌ని కూడా కలుపుకోవచ్చు.

### కూరలతో తినకండి..

చాలా మంది చపాతీలను కూరలతో తింటూ ఉంటారు. ఈ కూరల్లో ఎక్కువగా ఆయిల్, నెయ్యి, మసాలాలు ఉపయోగిస్తారు. అలా కాకుండా తక్కువ నూనెతో చేసినవి లేదంటే.. వెజిటేబుల్స్ సలాడ్స్‌తో చపాతీ తినేందుకు ట్రై చేయండి.

### చికెన్ సలాడ్

చికెన్ అంటే చాలా మందికి ఇష్టం. ఇందులో అనేక మంచి పోషకాలు ఉంటాయి. ఇవి తీసుకోవడం వల్ల శరీరానికి ఎంతో మంచిది. చికెన్‌తో కూడా సలాడ్ చేసుకోవచ్చు. చికెన్‌లో ఎండు మిర్చి, ఉప్పు, పసుపు, అల్లం కొద్దిగా వేసి ఉడికించండి. ఈ చికెన్‌ని చిన్న ముక్కలుగా కట్ చేసి.. ఇందులో క్యాబేజీ, క్యారెట్, బ్రోకలీ ఇలా మీకు ఇష్టమైన వెజిటేబుల్స్, ఆలివ్ ఆయిల్ వేసుకుని కలపండి. ఇలాంటి సలాడ్స్‌తో చపాతీ తింటే.. చాలా ఈజీగా వెయిట్ లాస్ అవుతారు. అన్ని పోషకాలు కూడా మీకు లభిస్తాయి. అదే విధంగా చపాతీలను చాలా మితంగా తీసుకోవాలి.

# వర్షా కాలంతో వ్యాధులు వస్తాయి..!

- చినుకు పడితే దోమలు, ఈగల బెడద
- విజృంభించనున్న డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్
- వానలో తడిస్తే చర్మ వ్యాధులు వచ్చే అవకాశం

**ముందడుగు ఆరోగ్యం:**

వర్షాకాలం మొదలవుతోంది. ఇప్పటికే దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఒక్కోచోట భారీ వర్షాలు కురుస్తున్నాయి. అయితే ఈ వర్షాకాలంలో చాలా జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అకస్మాత్తుగా కురిసే వర్షాలు లేదా భారీ వర్షాల కారణంగా పలు రకాల వ్యాధుల బారిన పడాల్సి ఉంటుంది. ముఖ్యంగా సీజనల్ వ్యాధులు కూడా మొదలయ్యే అవకాశం ఉంటుంది. మరోవైపు వానలో తడవడం వల్ల చర్మ రోగాలు కూడా ఏర్పడతాయి.



### సీజనల్ వ్యాధులు

వర్షాకాలంలో దోమలు, ఈగలు, చిన్న చిన్న పురుగులు ఎక్కువగా తిరుగుతుంటాయి. వర్షం పడిందంటే చాలు ఎక్కడ చూసినా దోమలు, ఈగల బెడద మొదలవుతుంది. వీటి వల్ల మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి అనేక రకాల వ్యాధుల బారిన పడాల్సి ఉంటుంది. అయితే ఇలాంటి సీజనల్ వ్యాధుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి.

### తక్షణమే ఇవి పాటించండి

వర్షాల కారణంగా దగ్గు, జలుబు వంటి సమస్యలు కూడా ఎదురయ్యే అవకాశాలు ఉంటాయి. వర్షంలో తడవడం వల్ల చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు ఈ సమస్యలు తప్పవు. అందువల్ల వర్షంలో తడిస్తే వెంటనే వేడి నీరు కాచుకుని ఆవిరి పట్టాలి. ఆవిరి పట్టే నీళ్లలో కాస్త పసుపు వేసుకుని పట్టడం వల్ల జలుబు త్వరగా తగ్గిపోతుంది. ఆవిరి పట్టే సమయంలో అందులో కొంచెం జెండూబామ్ వేసుకుని ఆవిరి పట్టినా కూడా మంచి ఫలితం ఉంటుంది.

### పిల్లలు మరింత జాగ్రత్త

ముఖ్యంగా ఆస్తమా వంటి అనారోగ్య సమస్యలతో బాధపడేవారు వర్షా కాలంలో జాగ్రత్తగా ఉండాలి. శ్వాస సంబంధింత సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి వర్షంలో తడవకుండా జాగ్రత్తలు పాటించాలి. మరోవైపు వర్షకాలంలో ఎదురయ్యే అనారోగ్య సమస్యల్లో నిమోనియా కూడా ఉంటుంది. అందువల్ల సీజనల్ వ్యాధుల పట్ల చాలా జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. బ్యాక్టీరియా, వైరస్ వంటివి సోకే అవకాశాలు ఉంటాయి కాబట్టి, బయటకు వెళ్లి వచ్చిన వెంటనే వేడి నీళ్లతో స్నానం చేయడం మంచిది.

# నెలాఖరులోగా కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు?.. భూముల విలువ 20-40 శాతం పెంపు!

**ముందడుగు**

రాష్ట్రంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. భూముల విలువ సవరణపై ఇప్పటికే క్షేత్రస్థాయి అధ్యయనం పూర్తయిందని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం నిర్ణయం తీసుకొని, ఆదేశిస్తే వెంటనే పెంపుదల అమలు చేస్తామని చెబుతున్నారు. ఈ నెలాఖరులోగా ఆదేశాలు రావొచ్చని, దాదాపు 2040 శాతం వరకు పెంపుదల ఉండొచ్చని విశ్వసనీయ వర్గాల సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఈ ఏడాది మే 16న స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖ ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెంచాలని స్పష్టం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.18,500 కోట్ల ఆదాయం లక్ష్యంగా పెట్టుకోగా.. రూ.14,295 కోట్లు వచ్చింది. లక్ష్యంలో 77 శాతం మాత్రమే ఆదాయం రావడంపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. చాలా చోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉన్నదని, కాబట్టి భూముల విలువ, స్టాంపు డ్యూటీని సవరించాలని ఆదేశించారు. ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలి, వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లలో.. వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారణ జరగాలని స్పష్టం చేశారు. ఈ మేరకు స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అధ్యయనం జరిపారు. మార్కెట్ విలువకు అనుగుణంగా ఏయే ప్రాంతాల్లో ఎంత మేర పెంచవచ్చో నివేదికలు సిద్ధం చేశారు. ఇతర రాష్ట్రాల్లో పరిస్థితి ఎలా ఉన్నదో అధ్యయనం చేసి రెవెన్యూ శాఖ మంత్రికి వివరాలు అందజేసినట్టు తెలిసింది. వీటిని పరిశీలించిన అనంతరం భూముల విలువను ఎంత మేర సవరించాలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నది.

### పెంచిన ధరలతోనే.. బడ్జెట్ అంచనాలు?

ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌కు కసరత్తులు ప్రారంభించింది. శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో స్టాంపులు, రిజిస్ట్రేసన్ల శాఖలో పెంచబోయే ధరలకు అనుగుణంగానే అంచనాలు రూపొందించాలని ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. గత ఆర్థిక సంవత్సరం రూ.18500 కోట్ల ఆదాయ లక్ష్యం కాగా.. ఈసారి రూ.2021వేల కోట్ల మధ్యలో అంచనాలు ఉండొచ్చని చెబుతున్నారు. స్టాంపులు రిజిస్ట్రేషన్ల ద్వారా గతేడాదితో పోల్చితే కనీసం



40 శాతం అదనపు ఆదాయం సాధించేలా ప్రణాళికలు రూపొందించినట్టు తెలుస్తున్నది.

ముందడుగు
మంగళవారం, 11-6-2024, హైదరాబాద్



## వాళ్ల అవస్థ చూస్తే నవ్వొచ్చింది

సోషల్ మీడియా ప్రభావం పెరిగాక వార్తలు ఎంత వేగంగా వ్యాపిస్తున్నాయో.. అంతకంటే వేగంగా పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రస్తుతం చేతిలో సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ జర్నలిస్టే. అలా అయిపోయింది సొసైటీ. ఈ విషయంపై ఇటీవల కత్రినాకైఫ్ స్పందించింది. 'లాస్ట్ మంత్ నా భర్త విక్కీ కౌశల్ పుట్టినరోజును సెలబ్రేట్ చేసుకునేందుకు లండన్ వెళ్లాం. అక్కడ కొన్ని ఫొటోలు దిగాం. ఫొటోగ్రాఫర్ తప్పిదం వల్ల ఆ ఫొటోల్లో నేను గర్భం దాల్చినట్టుగా కనిపించాను. ఇక ఆ ఫొటోలు పట్టుకొని నేను ప్రెగ్నెంట్ అయినట్టుగా వార్తలు రాసేశారు. మేం ఇండియా వస్తున్నామని తెలిసి, నా ఫొటోలకోసం వీరంతా ఎయిర్‌పోర్ట్ ముందు కెమెరాలతో రెడీగా ఉన్నారు. నేను మామూలుగా రావడంతో అందరూ షాక్ అయ్యారు. వాళ్ల అవస్థ చూస్తే నవ్వొచ్చింది. నా ప్రెగ్నెన్సీ గురించి వాళ్లకెందుకు? అది మా సొంత విషయం కదా.. దానివల్ల దేశానికి ఏమైనా ఉపయోగం ఉందా? వార్తలు ఎలా ఉండాలో తెలియని వాళ్లు వార్తలు రాసేస్తున్నారు. అక్కడే వస్తుంది ప్రాబ్లమ్ అంతా' అంటూ చెప్పుకొచ్చింది కత్రినా.

## ప్రభాస్ కల్కి 2898 ఏడీ ట్రైలర్




గ్లోబల్ స్టార్ ప్రభాస్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్ కల్కి 2898 ఏడీ. మహానటి ఫేం నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. వైజయంతీ మూవీస్ తెరకెక్కిస్తున్న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా జూన్ 27న తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ప్రచార కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు మేకర్స్.

ముందుగా అందించిన అప్‌డేట్ ప్రకారం కల్కి 2898 ఏడీ ట్రైలర్ లాంఛ్ చేశారు మేకర్స్. ఈ చిత్రంలో ప్రభాస్ భైరవ పాత్రలో నటిస్తుండగా.. అతడి దోస్త్ బుజ్జి)గా స్పెషల్ కారు సందడి చేయనుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ భామలు దీపికా పదుకొనే, దిశా పటానీ ఫీ మేల్ లీడ్ రోల్స్ పోషిస్తుండగా.. లెజెండరీ యాక్టర్లు అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, రాజేంద్రప్రసాద్, పశుపతి కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

ఈ చిత్రం నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన కల్కి 2898 ఏడీ టైటిల్, గ్లింప్స్ వీడియో, టీజర్ మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతోంది.

## అభిమానులకు బర్త్ డే గిఫ్ట్స్



కె.ఎస్.రవీంద్ర(బాబీ) దర్శకత్వంలో బాలకృష్ణ నటిస్తున్న 'ఎన్బీకే 109' చిత్రం ఈ దసరాకి విడుదల చేయడానికి నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా కూడా బాలయ్య విజయపరంపరను కొనసాగించడం ఖాయమని అభిమానులు నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల కారణంగా ఈ సినిమా షూటింగ్‌కి కాస్త విరామం ఇచ్చిన బాలయ్య.. మళ్లీ లొకేషన్‌లోకి అడుగుపెట్టనున్నారు. సోమవారం బాలకృష్ణ పుట్టినరోజు. 64ఏళ్లు నిండి 65లోకి అడుగుపెట్టారాయన. ఈ సందర్భంగా బాలకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతూ ఓ ప్రత్యేక గ్లింప్స్‌ను నిర్మాతలు విడుదల చేశారు. బాలకృష్ణ పాత్రను పరిచయం చేస్తూ.. 'జాలి.. దయ.. కరుణ లాంటి పదాలకు అర్థం తెలియని అసురుడు' అంటూ ఓ పవర్‌ఫుల్ డైలాగ్‌ని రివీల్ చేశారు. ఈ గ్లింప్స్‌ను బట్టి ఇందులో బాలయ్య పాత్ర అత్యంత శక్తివంతంగా ఉండబోతున్నదని తెలుస్తున్నది.

### నాలుగో విజయంకోసం..

ఇదిలావుంటే.. ఈ పుట్టినరోజు సందర్భంలోనే అభిమానులు ఎప్పుడెప్పుడా.. అని ఎదురుచూస్తున్న బాలయ్యబోయపాటి సినిమా ప్రకటన కూడా వచ్చేసింది. 'బీబీ4' వర్కింగ్ టైటిల్‌తో రూపొందనున్న ఈ సినిమాకు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మాతలు. బాలకృష్ణ రెండవ కుమార్తె తేజస్విని ఈ చిత్రానికి సమర్పకురాలు కావడం విశేషం. అయితే.. ఇది 'అఖండ2'నా?, లేక వేరే కథా? అనేది మాత్రం తెలియాల్సి వుంది.